సాక్షి ప్రకాశం

బుధవారం। 13। ఆగస్టు। 2025



ఒంగోలు నగరంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు వర్షం కురుస్తూనే ఉంది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో కూడా భారీ వర్షం కురిసింది.

గరిష్టం/కనిష్టం 34/26

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికలు రద్దు చేయండి

● మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్



ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: రిగ్గింగ్, దౌర్జన్యం, అధికార దుర్వినియోగం, పోలీసు యంత్రాంగాన్ని విచ్చలవిడిగా వాడి అప్రజాస్వామిక పద్ధతిలో జరిగిన పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికలను రద్దు చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. ఒక డీఎస్పీ స్థాయి అధికారి ఓటు వేయటానికి వెళ్తున్న ఓటర్లను కాల్చి పారేస్తానని బెదిరించడం చూస్తుంటే ఎన్నికల్లో పోలీసుల అరాచకం ఏ విధంగా పరాకాష్టకు చేరిందో అర్థం చేసుకోవచ్చన్నారు. డీఎస్పీపై సమగ్ర విచారణ చేసి శాఖాపర చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌ను విజ్ఞప్తి చేశారు. 14 నెలల కూటమి అరాచక పాలనకు ఈ ఎన్నికలు నిదర్శనంగా నిలిచాయని, ప్రజాస్వామ్యం మంటగలిసిందని ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థిని కూడా ఓటు వేయనీయకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. ఎంపీ అవినాష్‌రెడ్డిపై దౌర్జన్యం, వైఎస్సార్ సీపీ కార్యాలయంలోకి వచ్చి కార్యకర్తలను పోలీసులు తరిమేయడం కూటమి ప్రభుత్వ అరాచకానికి పరాకాష్ట అని దుయ్యబట్టారు. ఈ విధంగా అన్ని వ్యవస్థలను నాశనం చేసి గెలిచే గెలుపు గెలుపుకాదన్నారు.

గవర్నర్ ఎట్ హోంకు జిల్లా నుంచి ముగ్గురు

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర గవర్నర్ ఎట్ హోం కార్యక్రమానికి జిల్లా నుంచి ముగ్గురికి ఆహ్వానం అందినట్లు ఏపీ జిల్లా ల్యాండ్ రిఫామ్స్ అధికారి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయవాడలోని గవర్నర్ కార్యాలయం రాజ్ భవన్‌లో సాయంత్రం గవర్నర్ ఇచ్చే విందులో పాల్గొనాలని ఆ ముగ్గురికి ఆహ్వానం అందింది. ఒంగోలు నగరంలోని నల్లూరి వారి వీధిలో ఉంటున్న బెస్ట్ రీసెర్చర్ డాక్టర్ మేదరమిట్ల కిషోర్‌బాబు, బెస్ట్ రీసెర్చర్/ఇన్నోవేటర్ డాక్టర్ బి.రేవతి, బెస్ట్ స్టూడెంట్ ఇన్నోవేటర్‌గా కొత్తపట్నంలోని ఎస్.రవి శ్రీశంకర్‌లకు ఆహ్వానం వచ్చినట్లు పేర్కొన్నారు.

కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులివ్వండి

ఒంగోలు సబర్బన్: నిజమైన కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు మంజూరు చేసి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ తహసీల్దార్లను, వ్యవసాయ శాఖ అధికార్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి మంగళవారం డోలు, తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులతో జేసీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈ వ్యవసాయ సీజన్లో ఎరువుల కొరత రాకుండా, రైతులు ఇబ్బంది పడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎరువుల సరఫరా, పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ, హౌసింగ్ ఫర్ ఆల్ కింద ఇంటి నివేశన స్థలాల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన, పీజీఆర్ఎస్‌లో రెవెన్యూ అంశాలపై వచ్చిన దరఖాస్తుల పెండెన్సీ, ఇంటి పట్టాల రీ వెరిఫికేషన్ ప్రక్రియ, రీ సర్వే పురోగతి, కౌలు రైతులకు పంట సాగుదారు హక్కుల కార్డుల మంజూరు, నిత్యావసర సరుకుల పంపిణీ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. వీడియో సమావేశంలో ఎస్.డి.సి లు వరకుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, డీఎస్ఓ పద్మశ్రీ, పాల్గొన్నారు.

బెదరగొట్టి.. వీధికెక్కి!



మార్కాపురం యార్డులో ఉన్న ఇసుక

కూటమి పార్టీల్లో ఇసుక తుఫాన్ చెలరేగుతోంది. అధికారంలోకి రావడంతోనే నాయకులు ఇసుక దందాకు తెరతీశారు. ఇప్పుడదే వివాదాలకు ఆజ్యం పోస్తోంది. ఉచితం మాటున జరుగుతున్న దోపిడీలో వాటాల కోసం మార్కాపురంలో టీడీపీ జనసేన నేతలు రోడ్డెక్కారు. ఒకరిపై ఒకరు అధికారులకు ఫిర్యాదు చేసుకున్నారు. జిల్లాలో ఇది హాట్‌టాపిక్‌గా మారింది. అధికార పార్టీ నేతల మధ్య చెలరేగిన ఈ దుమారం ఇష్టారాజ్యంగా జరుగుతున్న ఇసుక అక్రమాలకు సాక్ష్యంగా నిలుస్తోంది.

- ఇసుక కోసం కూటమి నేతల కొట్లాట
- తాము చెప్పిన రేటుకే విక్రయించాలంటూ లారీ ఓనర్లపై ఒత్తిడి
- రెండు వర్గాలుగా విడిపోయిన టీడీపీ, జనసేన నేతలు
- పోటాపోటీగా అధికారులకు ఫిర్యాదులు
- కూటమి నేతల కక్కుర్తితో ప్రజలపై రోజూ రూ.1.20 లక్షల భారం

మార్కాపురం: ఉచిత ఇసుక ఇస్తానని కూటమి ప్రభుత్వం గొప్పగా చెబుతున్నా మార్కాపురంలో మాత్రం ఉచిత ఇసుక కాదు కదా అధిక ధరలు పెట్టినా కూడా ఇసుక అందని పరిస్థితి. డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణంలో ఇసుక కాంట్రాక్టును కూటమి ప్రభుత్వం వచ్చిన రెండు నెలల తరువాత గొట్టిపాటి సురేంద్రకు అప్పగించింది. అంతకుముందు తాడేపల్లి, విజయవాడ, నెల్లూరు జిల్లా నుంచి మార్కాపురం లారీల యజమానులు ఆయా ప్రాంతాలకు బాడుగకు వెళ్లినప్పుడు అక్కడి నుంచి తిరుగు ప్రయాణంలో ఇసుకను మార్కాపురానికి తెచ్చి టన్ను రూ.800 లేదా రూ.900కు విక్రయించేవారు. కూటమి నాయకులు ఇసుకను టన్ను రూ.950 ప్రకారం తమకే అమ్మాలని హుకుం జారీ చేశారు. లేదంటే లారీలను తిరగనివ్వమంటూ బెదిరించారు. తమకు అమ్మని ఇసుక లారీలను వెంటపడి వేధించారు. దీంతో లారీల యజమానులు తప్పనిసరి పరిస్థితుల్లో టన్ను రూ.950 ప్రకారం ఇసుక కాంట్రాక్టర్‌కు విక్రయిస్తూ వస్తున్నారు. లారీల యజమానులు నేరుగా అమ్మితే టన్ను రూ.900కు భవన నిర్మాణదారులకు అందుతుంది. సదరు కాంట్రాక్టర్ తాను కొనుగోలు చేసిన ఇసుకను ప్రభుత్వం నిర్దేశించిన ధర అంటూ రూ.1300 ప్రకారం భవన నిర్మాణదారులకు విక్రయిస్తున్నారు. ఇక అదనంగా కాటా, ట్రాక్టర్ చార్జీలు చెల్లించుకోవాలి. ఇలా వినియోగదారులపై టన్నుకు రూ.400 భారం పడుతోంది. మార్కాపురం పట్టణానికి ప్రతిరోజూ సుమారు 15 నుంచి 20 లారీల ఇసుక వస్తోంది. అంటే సుమారు 300 టన్నులు వస్తుంది. అధికార పార్టీ నేతల నిర్వాకం ఫలితంగా ప్రజలపై రోజుకు రూ.1.2 లక్షల భారం పడుతోంది.

టన్ను రూ.800కు ఇవ్వాల్సిందే..

ఈ నేపథ్యంలో సదరు కాంట్రాక్టర్ మార్కాపురం లారీ ఓనర్స్ నాయకులను పిలిపించి ఈ నెల 1వ తేదీ నుంచి టన్ను రూ.950 కాకుండా తనకు రూ.800కే ఇవ్వాలని హుకుం జారీ చేశాడు. ఒక వారం రోజుల పాటు లారీల యజమానులు తమకు గిట్టుబాటు కాకపోయినా అధికారానికి తలొగ్గి ఇచ్చారు. అయితే ఇలానే కొనసాగితే కనీసం లారీ బాడుగ, డీజిల్ ఖర్చులు కూడా రావని అంటున్నారు. ఈ క్రమంలో లారీ ఓనర్స్ రెండు వర్గాలుగా చీలిపోయారు. ఒక వర్గం జనసేన నాయకుడు ఇమ్మడి కాశీనాథ్ మద్దతుదారులుగా ఉండగా, మరొకరు టీడీపీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మద్దతుదారులుగా ఉన్నారు. వారం క్రితం ఒక వర్గం వారు సమావేశమై ఇసుక దోపిడీపై అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబుకు సైతం వినతిపత్రం ఇచ్చి జోక్యం చేసుకోవాలని కోరారు. సోమవారం మీకోసం కార్యక్రమంలో కూడా సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. ఇదిలా ఉండగా రెండో వర్గానికి చెందిన మరికొంత మంది లారీ, టిప్పర్ ఓనర్స్ మార్కాపురంలో తమకు అసోసియేషన్ లేదని, సమ్మెలో పాల్గొనాలని తమను ఇబ్బంది పెడుతున్నారని ఎస్ శివారెడ్డి, వై ఆంజనేయులు తదితరులు డీఎస్పీ నాగరాజుకు వినతిపత్రం ఇచ్చారు. ఇంత జరుగుతున్నా మైనింగ్ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటున్నా తమకేమీ తెలియదన్నట్లుగా వ్యవహరిస్తున్న తీరు విస్మయం కలిగిస్తోంది.

టీడీపీ వర్సెస్ జనసేన:

ది లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకుల్లో కొంతమంది జనసేన ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్‌కు ముఖ్య అనుచరులు. ఆయన మద్దతు లేనిదే వీరిలా చేయరని భావించిన టిప్పర్ ఓనర్లు కొంతమంది సోమవారం సాయంత్రం తమను ఇసుక కాంట్రాక్టర్ ఇబ్బందులు పెట్టడం లేదని డీఎస్పీకి వినతిపత్రం ఇచ్చారు. ఈ వ్యవహారాలన్నింటినీ జనసేన, టీడీపీ నాయకులు తమ పార్టీ ముఖ్యనాయకులకు సమాచారాన్ని చేరవేశారు. టీడీపీ, జనసేన అమరావతి నాయకులు ఈ వ్యవహారంపై దృష్టిసారించి సమాచారం తెప్పించుకుంటున్నట్లు తెలిసింది. ఈ నెల 15లోగా తమ డిమాండ్లను నెరవేర్చకపోతే సమ్మె చేయడంతో పాటు అవసరమైతే తామే టన్ను రూ.950 ప్రకారం ఇసుకను భవన నిర్మాణదారులకు అందిస్తామని ప్రకటించారు. ఇప్పటి వరకూ జరిగిన ఇసుక దోపిడీపై, కూటమి నేతల తీరుపై ప్రజలు ఆగ్రహంతో రగిలిపోతున్నారు.

పస్తులుంటున్న భవన నిర్మాణ కార్మికులు

అధికార పార్టీ నేతల నిర్వాకం ఫలితంగా ఇసుక కొరత ఏర్పడింది. కృత్రిమ కొరత సృష్టిస్తుండడంతో పనులు లేక భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. నెలలో పది రోజులు కూడా పని దొరకడం గగనంగా మారింది. పనులు జరగకపోవడంతో కార్మిక కుటుంబాలు పస్తులుండాల్సిన దుస్థితి నెలకొంది. ఇదే పరిస్థితి కొనసాగితే ఆత్మహత్యలే శరణ్యమని వాపోతున్నారు. ప్రభుత్వం చెప్పిన విధంగా ఇళ్లు నిర్మించుకునే వారి ఇంటి వద్దకు ఉచితంగా ఇసుక చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

కేంద్ర బలగాలతో రీపోలింగ్ జరపాలి



బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: భారతదేశ చరిత్రలో ఎప్పుడూ...ఎక్కడా..ఇంత దారుణమైన ఎన్నికల నిర్వహణ జరగలేదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికలపై ఆయన మాట్లాడుతూ బయట నుంచి దొంగ ఓట్లు వేసేందుకు టీడీపీ కార్యకర్తలు ఎక్కడికక్కడ తెగబడ్డారన్నారు. రిగ్గింగ్ చేస్తుంటే పోలీసులే సహకరించడం దారుణంగా ఉందన్నారు. ఓటర్లను బూత్‌లకు వెళ్లనివ్వకుండా వాళ్లే ఓట్లు వేసుకుంటే ఎన్నికలు నిర్వహించడం ఎందుకు ..? ఎన్నికల కమిషన్ తీరు దారుణంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల ఓటరు స్లిప్పులు లాక్కుని టీడీపీ గూండాలు వారిని తరిమి కొడుతుంటే పోలీసులు గుడ్లప్పగించి చూశారన్నారు. దొంగ ఓట్లేసుకునే వారికి పోలీసులు సహకరించడం నిస్సిగ్గుగా ఉందన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఎన్నికల కమిషన్ పూర్తిగా ఖూనీ చేసిందని మండిపడ్డారు. ఓట్లేయించుకోనివ్వండని పోలీసుల కాళ్లు పట్టుకోవడం ఈ ప్రపంచంలో ఎక్కడా చూడలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

పెద్దపులి దాడిలో గేదె మృతి



పెద్దపులి దాడిలో మృతి చెందిన గేదె

గిద్దలూరు రూరల్: మండలంలోని వెల్లుపల్లె అటవీప్రాంతంలో పెద్దపులి దాడి చేయడంతో గేదె మృతి చెందిన ఘటన మంగళవారం జరిగింది. మోడీ రంగస్వామి అనే రైతుకు చెందిన గేదెపై పెద్ద పులి దాడి చేయడంతో అది చనిపోయిందని రైతు వాపోయాడు. రూ.80 వేలు విలువచేసే తన గేదె మృతి చెందిందని తనకు నష్టపరిహారం ఇప్పించాలని కోరాడు. పులి పాదాలను సమీపంలో ప్రాంతంలో అటవీ సిబ్బంది గుర్తించారు.

సరెండర్ లీవ్ బకాయిలు వెంటనే చెల్లించాలి

● ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి



రండి టీ తాగుతూ మాట్లాడుకుందాంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి, సంఘ నాయకులు

ఒంగోలు సిటీ: పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ బకాయిలు వెంటనే చెల్లించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గం చేపట్టిన 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' కార్యక్రమం ప్రకాశం జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చిన్నపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రకాశం భవనంలోని విద్యాశాఖ అధికారి కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి రంగారెడ్డి, ఒంగోలు పట్టణ అధ్యక్షుడు మోటా శ్రీనివాసరావు, విద్యాశాఖ సిబ్బంది శివశంకర్, వేణు, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో విధులు నిర్వర్తించండి

● ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌శర్మ



మాట్లాడుతున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ

ఒంగోలు టౌన్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో పదోన్నతి పొందిన ఉద్యోగులు నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని ఆ శాఖ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ సూచించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో విధులు నిర్వహిస్తూ 99 మంది ఎస్సైలుగా, ఒకరు సీఐగా, ఇద్దరు ఏఈఎస్‌గా పదోన్నతి పొందారు. వీరికి మే 15 నుంచి మూడు నెలలపాటు ఒంగోలు పోలీసు ట్రైనింగ్ కళాశాలలో శిక్షణ ఇచ్చారు. శిక్షణ ముగింపు సందర్భంగా మంగళవారం వీడ్కోలు సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ మాట్లాడుతూ.. పదోన్నతి హోదాతోపాటు బాధ్యతలను కూడా పెంచుతుందన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేయాలని సూచిస్తూ అభినందనలు తెలిపారు. అనంతరం వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీటీసీ ప్రిన్సిపాల్ జీఆర్ రాధిక, జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు, అసిస్టెంట్ కమిషనర్ దయాసాగర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ షేక్ ఆయేషా బేగం, పీటీసీ వైస్ ప్రిన్సిపాల్ డి.లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్ కలకలం

● పోలీసులు గాలిస్తుండటంతో బాలికను వదిలేసిన కిడ్నాపర్లు



బాలికను తల్లిదండ్రులకు అప్పగించిన అనంతరం మాట్లాడుతున్న డీఎస్పీ యు.నాగరాజు

రాచర్ల/పెద్దారవీడు: పాఠశాలకు వెళ్లిన బాలికను గుర్తుతెలియని వ్యక్తులు కారులో కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు. పోలీసుల గాలింపు ఎక్కువ కావడంతో భయపడి పక్క మండలంలోని ఓ డంపింగ్ యార్డ్ వద్ద వదిలేసి వెళ్లిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు రాచర్ల మండలం అనుమలవీడు గ్రామానికి చెందిన మూడుమంచు గురుఅంజలి(8) అదే గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. ఉదయం 8 గంటలకు తండ్రి పాపయ్య తన కుమార్తె గురుఅంజలికి పాఠశాలలో వదిలి పెట్టి వచ్చాడు. అప్పటికే గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాల సమీపంలోని రోడ్డు పక్కనే కారును నిలుపుకున్నారు. గం.8:25 కు గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాల లోపలికి వచ్చి గురుఅంజలి పేరు పెట్టి పిలిచి కారులో మీ నాన్న ఉన్నాడు పిలుస్తున్నాడు రావాలని బయటికి తీసుకెళ్లి బలవంతంగా బాలికను కిడ్నాప్ చేసి కారులో తీసుకెళ్లారు. పాఠశాలలో బాలిక కనబడకపోవడంతో ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. పాఠశాలలో వంట చేసే వారు గుర్తుతెలియని వ్యక్తులు కారులో తీసుకుని వెళ్లారని చెప్పడంతో వెంటనే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్.రఫీ ఉదయం గం.10:30 స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. వెంటనే గిద్దలూరు రూరల్ సీఐ జే.రామకోటయ్య, ఎస్సై పి.కోటేశ్వరరావు పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. తెలుపు అండ్ సిల్వర్ రంగు కారులో గుర్తుతెలియని వ్యక్తులు గురుఅంజలిని కిడ్నాప్ చేసి తీసుకెళ్లారని తెలియడంతో పోలీసులు అనుమలవీడు టూ సోమిదేవిపల్లె, సంగపేట వయా బేస్తవారిపేట మండలం, జగ్గంబొట్ల కృష్ణపురం వరకూ ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ విషయాన్ని అన్ని పోలీస్‌స్టేషన్లకు సమాచారం పంపించి అప్రమత్తం కావడంతో తాము దొరికిపోతామని భావించిన కిడ్నాపర్లు బాలికను పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు గ్రామం సమీపంలో డంపింగ్ యార్డు వద్ద వదిలి వెళ్లిపోయారు. అక్కడే రోడ్డు పక్కన ఒంటరిగా నిల్చొని వచ్చిపోయే ద్విచక్ర వాహనదారులను ఆపాలని కేకలు పెడుతూ ఏడుస్తోంది. అదే సమయంలో మార్కాపురం నుంచి ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై దోర్నాలకు వెళ్తుండగా వారిని బండి ఆపాలని బాలిక కోరింది. తనను ఎవరో ఇక్కడ వదిలేసి వెళ్లారని ఏడుస్తూ చెప్పింది. దీంతో వారు పెద్దారవీడు హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావుకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని, బాలికను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ నుంచి బాలికను పెద్దారవీడు ఎస్సై రాజుమోహన్‌రావు, ఏఎస్సై సుబ్బయ్య అనుమలవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు తీసుకొచ్చి మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు సమక్షంలో బాలిక తల్లిదండ్రులైన పాపయ్య, రాజేశ్వరిలకు అప్పగించారు. కారులో ముగ్గురు యువకులు ఉన్నట్లు బాలిక పోలీసులకు తెలిపింది.